## సమస్యల పరిష్కారం కోసం మేయర్‌కు వినతి



మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డికి పలు స్థానిక సమస్యలపై వినతిపత్రాన్ని అందజేస్తున్న స్థానికులు

దుండిగల్,అక్టోబర్12: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పలు కాలనీలకు చెందిన అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు స్థానిక సమస్యలపై గురువారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలను అందించారు. ఆయా కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ శాఖల అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు బాచుపల్లి రైసినియా ఇంటెలి పార్క్ అసోసియేషన్ ప్రతినిధులు, ప్రగతినగర్ వాసులు, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్-2, ఫేస్-3 కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయినేతలు ఓటింగ్‌పై అవగాహన పెంచాలి



బూత్‌కమిటీల సమావేశంలో కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నేతలు

జగద్గిరిగుట్ట, అక్టోబర్12: ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్ భారీ మెజారిటీ సాధించేలా కృషిచేద్దామని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ కోరారు. రంగారెడ్డినగర్ లో గురువారం పలుకాలనీలు, బస్తీలకు చెందిన బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఆయ్యారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని తెలియజేయాలన్నారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు ఆయా ఓటర్లకు పోలింగ్ కేంద్రం సమాచారం అందేలా చూడాలన్నారు. వివేకానంద్‌ను మూడోసారి గెలిపించడంలో ప్రాంతీయ నేతలు, బూత్ కమిటీలే ప్రధాన పాత్ర వహించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల సంక్షేమసంఘాలు, బీఆర్ఎస్ నేతలు, మహిళా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం



శ్యామల

మియాపూర్, అక్టోబర్ 12: ఇంట్లో నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యం అయిన సంఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు గురువారం సాయంత్రం తెలిపిన వివరాల ప్రకారం.. దగ్గుమతి శ్యామల(70) మియాపూర్‌లోని గోకుల్ ప్లాట్స్‌లోని తన బంధువు ఇంటి నుంచి బుధవారం సాయంత్రం 4 గంటలకు బయటకు వెళ్లింది. కుటుంబ సభ్యులకు ఎటువంటి సమాచారం అందించకుండా వెళ్లటంతో.. పరిసర ప్రాంతాలు బంధువుల ఇండ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో మియాపూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పోలీసుల తనిఖీలు విస్తృతం

జగద్గిరిగుట్ట, అక్టోబర్12: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలోని సెక్టార్ల ప్రధానరహదారుల్లో వ్యక్తిగత వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పలు చోట్ల ప్రత్యేక చెక్‌పాయింట్లు ఏర్పాటు చేసి నిఘా ఉంచుతున్నారు. జగద్గిరిగుట్ట సీఐ కాంత్రికుమార్ నేతృత్వంలోగురువారం ఔట్‌పోస్ట్ చౌరస్తా, పైపలైన్‌రోడ్డు, రుడామిస్త్రీనగర్, కూకట్‌పల్లి రహదారిలో తనిఖీలు జరిగాయి. నర్సాపూర్ ప్రధానరహదారి, గాంధీనగర్, గాజులరామారం రోడ్డు పరిసరాల్లో జీడిమెట్ల పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.

### జీడిమెట్ల ఠాణా పరిధిలో..

పారదర్శకం, శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలందరూ సహకరించాలని పోలీసుఉన్నతాధికారులు కోరారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా గురువారం రాత్రి బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ గంగారాం జీడిమెట్ల ఠాణా పరిధిలో పరిశీలన చేపట్టారు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో విధులో సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వంచారు. ఈసందర్భంగా అక్కడివారితో స్థానిక పోలింగ్అంశాలపై అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆలయ కమిటీల మద్దతు



ఎమ్మెల్యేకు మద్దతుగా లేఖ ఇస్తున్న ఆలయాల ప్రతినిధులు

జగద్గిరిగుట్ట, అక్టోబర్: ఎన్నికల్లో ఎమ్మెల్యే వివేకానంద్‌కు పూర్తిగా మద్దతు ఇస్తామని రంగారెడ్డినగర్ హిందూదేవాలయాల కమిటీ సభ్యులు తెలిపారు. పలు ఆలయాల ప్రతినిధులు గురువారం ఆయనను చింతల్ కార్యాలయంలో కలిశారు. ఆలయాల అభివృద్ధిలో ఎమ్మెల్యే అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. మూడోసారి గెలుపొంది నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ మేరకు తాము చేసిన ఏకగ్రీవ తీర్మాన ప్రతిని ఆయనకు అందజేశారు. బాలరాజు, ఆంజనేయ శాస్త్రి, క్రాంతి యాదవ్, మురుగేశ్, ఓంకార్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ మరమ్మతులు

కుత్బుల్లాపూర్, అక్టోబర్12: కొంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఆయా ప్రాంతాల్లో కరెంటు మరమ్మతులు చేస్తున్న కారణంగా కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వినాయక్ రాథోడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఎన్‌సీఎల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కెవీఆర్ ఫంక్షన్‌హాల్‌లైన్, విజయశాంతి ఎన్క్లేవ్, శివారెడ్డిగౌడ్స్ ఎన్‌సీఎల్ నార్త్, ఎన్‌సీఎల్ స్విమ్మింగ్‌పూల్, సాయిబాబా టెంపుల్, ప్రజయ్ అపార్ట్‌మెంట్, మనభూమి ఎన్క్లేవ్, వెన్‌సాయి అపార్ట్‌మెంట్ ఏరియాతో పాటు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 11కేవీ వెన్‌సాయి ఫీడర్ పరిధిలో జయభేరి గార్డెన్ సొసైటీ, కేవీఆర్ ఏరియా ప్రాంతాల్లో కరెంటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

# వెన్నెలగడ్డ చెరువు అభివృద్ధికి సుచిత్ర అకాడమీ కృషి..

కుత్బుల్లాపూర్,అక్టోబర్12: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలో వెన్నెలగడ్డ చెరువు అభివృద్ధికి సుచిత్ర అకాడమీ విద్యాసంస్థ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా చెరువును సుందరీకరణగా తీర్చిదిద్దడంతో పాటు చెరువులో వివిధ రకాలైన ప్లాంట్ల మొక్కల ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణ దిశగా చెరువును అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. గురువారం చెరువు వద్ద ప్రారంభించిన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హాజరై ప్రారంభించారు. రాబోయే రోజుల్లో అన్ని రకాలు చెరువును అభివృద్ధి చేసి మినీట్యాంకుబండ్‌లా తీర్చిదిద్దేందుకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర అకాడమీ ఫౌండర్ అండ్ డైరెక్టర్ ప్రవీణ్ రాజు, ప్రిన్సిపాల్ దీపాకపూర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నరేందర్ రెడ్డి, తోకల నగేశ్‌రెడ్డి, సమ్మయ్యనేత, యేసు, శ్రీను, కాలే నగేశ్, బాలమల్లేశ్, విజయ్‌హరీశ్, అశోక్ విద్యార్థులు పాల్గొన్నారు.



వెన్నెలగడ్డ చెరువు అభివృద్ధిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, సుచిత్ర అకాడమీ యాజమాన్యం

## బీఆర్ఎస్‌లో చేరిన
# తెలుగుతల్లి నగర్ కాలనీవాసులు



సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లి నగర్ కాలనీకి చెందిన బీజేపీ కార్యకర్తలను బీఆర్ఎస్‌లోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,అక్టోబర్12: 130 సుభాష్‌నగర్ డివిజన్ తెలుగుతల్లీ నగర్ ప్రాంతానికి చెందిన జూనియర్ గద్దర్‌గా పేరుగాంచిన కళాకారుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సుమార్ 200 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో చింతల్ క్యాంపు కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యాదగిరి, తారసింగ్, రాధాకృష్ణ, కృష్ణగౌడ్, దేవాగౌడ్, అర్జున్ గౌడ్, రవికుమార్‌గౌడ్, ఆదిత్య, సాయికిశోర్, జయరాం, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

కుత్బుల్లాపూర్,అక్టోబర్12: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న స్థావరంపై పేట్ బషీరాబాద్ పోలీసులు దాడులు చేసి నగదు స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాంనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం జయభేరి బొబ్బిలి ఎంపైర్ ప్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలంపై దాడులు చేయగా ఐదుగురు పేకాటరాయుళ్ల వారి వద్ద లభించిన లక్షా 17,970 నగదును స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్ చేసినట్లు తెలిపారు.

## బతుకమ్మ పండుగ ఏర్పాట్ల పరిశీలన



సీసలబస్తీలో బతుకమ్మకుంట పరిశీలిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట, అక్టోబర్12: దసరా, బతుకమ్మపండుగ ఘనంగా జరిగేలా చూస్తామని కార్పొరేటర్ జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట సీసలబస్తీలో బతుకమ్మ కుంటను గురువారం పరిశీలించారు. పరిసరాలు శుభ్రం చేసి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మఖ్దూంనగర్‌లోని దుర్గా మండపం ఏర్పాట్లు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తి రిమాండ్

కుత్బుల్లాపూర్,అక్టోబర్12: జోమాటో బ్యాగులో గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తిని పట్టుకొని రిమాండ్ చేసిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గం మధురానగర్‌లో నివాసం ఉంటున్న అస్సాం రాష్ట్రానికి చెందిన దీపాంకర్ మేధీ(25) కూలీ పనులు చేసుకుంటూ జీవనం పొందుతున్నాడు. ఈ నెల 11న జోమాటో బ్యాగులో ఉన్న సరుకును మరో వ్యక్తికి ఇస్తే అతడు నీరు రూ.5 వేల ఇస్తాడని ఓ వ్యక్తి చెప్పడంతో, ఆ బ్యాగును తీసుకొని గుండ్లపోచంపల్లి చౌరస్తాకు వచ్చాడు. చాలా సేపు నుంచి ఓ వ్యక్తి అనుమానస్పదంగా జోమాటో బ్యాగు వేసుకొని తిరుగుతున్నాడని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అతడి బ్యాగులో 10 కిలోల ఎండు గంజాయి బెండలు లభించాయి. నిందితుడిని స్థానిక పోలీస్ స్టేషన్ తరలించి విచారించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.